నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, బుధవారం 6 నవంబర్ 2024 | SANGAREDDY

పలు హోటళ్లకు జరిమానా

సిద్దిపేట హోటల్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్

సిద్దిపేట, నవంబర్ 5: సిద్దిపేటలోని పలు హోటళ్లకు మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని హైదరాబాద్ రోడ్‌లో గల ఆయత్ హోటల్ నిర్వహణ సరిగా లేకపోవడం అపరిశుభ్రంగా ఉండడంతో రూ.30వేల జరిమానా, అక్షయ హోటల్‌కు రూ.15 వేల జరిమానా విధించారు. అనంతరం హోటల్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను పరిశీలించారు. నర్సాపూర్ రస్తా వద్ద నూతనంగా నిర్మిస్తున్న నేషనల్ మార్ట్ వారు అనుమతులు లేకుండా యూజీడీ కనెక్షన్ తీసుకోవడంతో జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనితకు ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ వెంట అధికారులు దేవరాజు, పృథ్వి తదితరులు ఉన్నారు.

హద్దులు తేల్చేనా..!

- చెరువుల ఎఫ్‌టీఎల్ ఖరారుకు గ్రహణం
- హెచ్‌ఎండీఏ పరిధిలో నత్తనడకన చెరువుల డిజిటల్ సర్వే
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల ప్రకటనలో జాప్యం
- హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో ఆందోళనలో ప్రజలు

సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని చిన్నాపూర్ చెరువు

సంగారెడ్డి, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని ఇండ్ల నిర్మాణాలను హైడ్రా ద్వారా వేగంగా కూల్చివేస్తున్నది. హెచ్‌ఎండీఏ పరిధికి సంగారెడ్డి జిల్లా నుంచి ఎనిమిది మండలాలు వస్తాయి. ఈ ఎనిమిది మండలాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని మిగతా గ్రామాల్లోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల విషయంలో స్పష్టత లేదు. నీటిపారుదల, సర్వేశాఖలు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు గతంలోనే ఖరారు చేశాయి. సర్వేశాఖ అధికారులు మార్కింగ్‌లు చేయడంతో రాళ్లను పాతినప్పటికీ కాలక్రమంలో అవి తొలిగిపోయాయి. దీంతో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు తెలియక కొంతమంది ఇండ్లు నిర్మించుకున్నారు. కొన్ని చోట్ల రియల్టర్లు సొమ్ము చేసుకునేందుకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో వెంచర్లు వేశారు. హైడ్రా కూల్చివేతలతో ఇప్పుడు వారంతా ఆందోళన చెందుతున్నారు.

పూర్తిచేస్తామంటున్న నీటిపారుదల శాఖ

హెచ్‌ఎండీఏ పరిధిలోని పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల్లో ఎక్కువగా చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల అన్యాక్రాంతం అయ్యాయి. దీంతో నీటిపారుదల శాఖ ఈ రెండు నియోజకవర్గాల్లోని చెరువుల కబ్జాకు అడ్డుకట్టవేసేందుకు డిజిటల్ సర్వేచేసి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను ఖరారు చేయాలని నిర్ణయించింది. దీంతోపాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, డిజిటల్ మ్యాప్‌లు ఆన్‌లైన్‌లో ఉంచాలని నిర్ణయం తీసుకుంది. హెచ్‌ఎండీఏ పరిధిలో పటాన్‌చెరులో 106, రామచంద్రాపురం 14, అమీన్‌పూర్ 37, గుమ్మడిదల 86, జిన్నారం144, సంగారెడ్డి 41, కంది 91, హత్నూర 147 చెరువులు ఉన్నాయి. మొత్తం ఎనిమిది మండలాల పరిధిలో మొత్తం 666 చెరువుల డిజిటల్ సర్వే, ఎఫ్‌టీల్ బఫర్‌జోన్ల ఖరారును జిల్లా యంత్రాంగం ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది. మొత్తం 666 చెరువులకు 409 చెరువులకు సంబంధించి డిజిటల్ సర్వే పూర్తి అయ్యింది. ఇందులో 250 చెరువుల ప్రాథమిక నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యాయి. 50కి పైగా చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు ఖరారు చేసి ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. కాగా, ఇంకా 600కుపైగా చెరువులకు సంబంధించి డిజిటల్ సర్వే పనులు పూర్తి చేసి ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు ఇంకా ఆరునెలలకు పైగా సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. హైడ్రా పేరుతో ఓవైపు ప్రభుత్వం హెచ్‌ఎండీఏ పరిధిలోని మండలాల్లో కూల్చివేతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్న క్రమంలో చెరువుల డిజిటల్ సర్వే నత్తనడకన సాగుతుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల వివరాలు, డిజిటల్ మ్యాప్‌లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండే చెరువులు కబ్జాకు గురికాకుండా ఉండడంతో పాటు జనం అప్రమత్తమై ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ప్లాట్లు కొనుగోలు చేయడం, ఇండ్లు నిర్మించుకోవడం నిలిచిపోయే అవకాశం ఉంటుంది. ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి చెరువుల డిజిటల్ సర్వే పనులు వేగవంతం చేయాలని ఆదేశించినా ఫలితం కనిపించడం లేదు. జిల్లా కలెక్టర్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు మరింత ఒత్తిడి తీసుకువస్తే తప్పా చెరువుల డిజిటల్ సర్వే ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఈ విషయమై నీటిపారుదల శాఖ ఈఈ జైంభీమ్ వివరణ కోరగా.. సాధ్యమైనంత త్వరగా హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువుల డిజిటల్ సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా చెరువుల డిజిటల్ సర్వే పూర్తి చేసి ఆన్‌లైన్‌లో మ్యాప్‌లను అందుబాటులో ఉంచే ప్రక్రియ వేగవంతం చేయనున్నట్లు ఆయన చెప్పారు.

రామాయంపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రైతుల ఉసురు పోసుకుంటున్న ప్రభుత్వం

- రెండు రోజుల్లో ధాన్యం కాంటా పెట్టాలి
- మొలకలు వచ్చిన ధాన్యాన్ని బేషరతుగా కొనాలి
- వడ్లకు రూ.500 బోనస్ అంటూ సర్కారు దొంగనాటకం
- మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి విమర్శలు
- చేగుంట, రామాయంపేట మండలాల్లో పర్యటన

రామాయంపేట/చేగుంట, నవంబర్ 5: అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఏర్పాటు చేసిన కేంద్రాల్లో రెండు రోజుల్లో ధాన్యం కాంటా పెట్టకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం రామాయంపేట,చేగుంట మండలాల్లో ఆమె పర్యటించారు. రెండు మండలాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటున్నదని విమర్శించారు. రేవంత్ సర్కార్‌లో రైతులకు కష్టాలే తప్ప మేలు జరగడం లేదన్నారు. ప్రభుత్వం తూతూమంత్రంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం సేకరించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌కు పోయేకాలం దగ్గర పడిందన్నారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తానని గొప్పలు చెప్పుడు తప్ప ఇప్పటి వరకు ఏ రైతుకు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని పద్మాదేవేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనాలన్నారు. మ్యాచర్ పేరిట ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇలాగే మొండికేస్తే రైతులతో ఆందోళనలు చేపడతామని, రోడ్లను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఆమె వెంట రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రం, కౌన్సిలర్ అనిల్‌కుమార్ ఉన్నారు.

జెప్తిశివనూరులో...

నార్సింగి మండలం జెప్తిశివనూర్‌లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు రోడ్ల మీద ఆరబట్టిన ధాన్యం వర్షానికి తడిసి, ముక్కిన వడ్ల కుప్పలను మంగళవారం పద్మాదేవేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు గోడు వెళ్లబోసుకున్నారు. ఆమె వెంట నార్సింగి, చిన్నశంకరంపేట బీఆర్ఎస్ మండలాల పార్టీ అధ్యక్షులు మైలరాం బాబు, పట్లోరి రాజు, మాజీ వైస్ ఎంపీపీ దొబ్బల సుజాత శంకర్, కాసులపూర్ యాదగిరి, గొండ స్వామి, రైతులు ఉన్నారు.

సిద్దిపేట జిల్లా పెద్దరాజుపేటలో ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ మనుచౌదరి

పక్కాగా ధాన్యం సేకరించాలి

సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

చేర్యాల, నవంబర్ 5: సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని నాగపురి, పెద్దరాజుపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం సాయంత్రం కలెక్టర్ మనుచౌదరి సందర్శించి కొనుగోళ్లపై ఆరాతీశారు. రైతులతో నేరుగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాగపురి, శభాష్‌గూడెం, పెద్దరాజుపేట, పోతిరెడ్డిపల్లి గ్రామాల రైతులు పండించిన సన్నవడ్లను కొనుగోలు చేసేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. సన్నవడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పక్కాగా ధాన్యం సేకరించాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్‌దేవ్ ఆర్య, అడిషనల్ డైరెక్టర్ మధుసూదన్, పీడీ జయదేవ్, ఏపీడీ మధుసూదన్, డీఎస్‌వో, డీఎంసివిల్ సప్లయిస్ అధికారులు, తహసీల్దార్ సమీర్ అహ్మద్‌ఖాన్, ఐకేపీ ఏపీఎం ప్రకాశ్, ఏవో, సీసీలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మహిళా సంఘాల అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

ధాన్యం కాంటాలు వేయాలి

మెదక్ అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నేతలు

మెదక్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): దళారీ వ్యవస్థను వెంటనే అరికట్టాలని, వడ్ల తేమశాతం 17శాతానికి పెంచాలని అన్ని కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని మెదక్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మెంచు నగేశ్‌కు మెదక్ మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటనే సేకరించి తూకం వేయాలని కోరారు. ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, మౌలిక వసతులు కొనుగోలు కేంద్రాల్లో కల్పించాలన్నారు. సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లను వేర్వేరుగా చేపట్టాలని, ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధర, నాణ్యతాప్రమాణాల గురించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అన్ని రకాల సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్ణీత తేమశాతం వచ్చిన ధాన్యం వెంటనే కొనుగోలు చేసి రవాణా చేయాలని, రైస్ మిల్లర్లు, రైతులకు ఇబ్బంది కలగకుండా వెంటనే ధాన్యం దిగుమతి చేసుకొని చర్య లు తీసుకొని ట్రక్ షీట్ అందజేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. తడిసిన ధాన్యాన్ని, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కోకన్వీనర్ గడ్డమీద కృష్ణ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు జయరాజు, ఆర్కే శ్రీనివాస్, మెదక్ మండల పార్టీ అధ్యక్షుడు అంజిగౌడ్, నాయకులు ప్రభురెడ్డి, మాయ మల్లేశం, మెడిశెట్టి శంకర్, మధు, మోహన్ రాథోడ్, రామచంద్రారెడ్డి, సాయిలు, లింగం ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో మూడు పంటలు

ఆదర్శంగా నిలుస్తున్న మద్దూరు రైతు

సిద్దిపేట జిల్లా మద్దూరులో ఏకకాలంలో సాగు చేసిన డ్రాగన్, మునగ, పత్తి పంటలు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 5: వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయాయి. పంటల దిగుబడులు కంటే పెట్టుబడి ఖర్చులు అధికం అవుతుండడంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. దీనిని అధిగమించేందుకు ఇటీవల కాలంలో రైతులు విభిన్న రీతుల్లో పంటలను సాగుచేస్తూ లాభాలు పొందుతున్నారు. ఇదే తరహాలో సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రానికి చెందిన కంఠారెడ్డి మధుసూదన్‌రెడ్డి అనే రైతు తనకున్న ఐదెకరాల భూమిలో తొలుత డ్రాగన్ పంటను సాగుచేశాడు. డ్రాగన్ పంట చేతికందేందుకు మూడేండ్ల సమయం పడుతుంది. అప్పటివరకు పెట్టుబడి ఖర్చులే తప్ప లాభాలు అనేవి లేవని గ్రహించిన మధుసూదన్‌రెడ్డి అంతర పంటగా మునగ పంటను సాగుచేశాడు. దీంతో సరిపెట్టకుండా అందులోనే మూడో పంటగా పత్తి పంటను సాగుచేశాడు. ఇలా ఏకకాలంలో ఒకే భూమిలో మూడు పంటలు సాగు చేయడంతో రైతుకు పెట్టుబడి ఖర్చులు తగ్గాయి. ఈ ఏడాది పత్తి పంట ఆశించిన దానికంటే అధికంగా దిగుబడి రావడంతో రైతు మధుసూదన్‌రెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాడు. దీనికితోడు మరో రెండు మూడు నెలల వ్యవధిలో మునగ పంట కూడా చేతికందుతుందని, మునగ పంటతో డ్రాగన్ పంటకు నీడ కూడా లభిస్తున్నదని, దీనివల్ల నీడ కోసం షెడ్ నెట్‌ను ఏర్పాటు చేసే అవసరం తప్పిందని సదురు రైతు తెలిపాడు. ఏకకాలంలో ఒకేభూమిలో మూడు పంటలు సాగు చేస్తుండడంతో మధుసూదన్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని పలువురు రైతులు సందర్శించి, పంటల సాగు గురించి ఆసక్తిగా తెలుసుకుంటున్నారు. రైతును వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు అభినందిస్తున్నారు.

పెట్టుబడులు తగ్గాయి

ఏకకాలంలో మూడు పంటలు సాగు చేస్తుండడంతో నాకు పెట్టుబడి ఖర్చులు చాలా వరకు తగ్గాయి. డ్రాగన్ పంటలో మునగ సాగు చేయడతో డ్రాగన్ మొక్కలకు నీడ లభిస్తుంది. దీనికితోడు మార్కెట్‌లో మునగ పంటకు బాగా డిమాండ్ ఉంది. పెట్టుబడి ఖర్చులు రాబట్టేందుకు పత్తి పంటను సాగు చేశాను. నా ప్రయత్నం విజయవంతమైంది. మామూలు పంట సాగుతో లభించే దిగుబడి కంటే అధికంగా పత్తి దిగుబడి వస్తున్నది. రైతులు పెట్టుబడి ఖర్చులను తగ్గించడం కోసం అంతర పంటలను సాగు చేసుకోవాలి.

– కంఠారెడ్డి మధుసూదన్‌రెడ్డి, రైతు, మద్దూరు (సిద్దిపేట జిల్లా)

తూప్రాన్ మండలం ఘనపూర్ స్టేజీ వద్ద రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

బస్సుల కోసం విద్యార్థుల రాస్తారోకో

తూప్రాన్, నవంబర్ 5: కళాశాలల సమయానికి బస్సులు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, సమయానుకూలంగా నడపాలని కళాశాల విద్యార్థులు రాస్తారోకోకు దిగారు. మంగళవారం తూప్రాన్ మండలంలోని ఘనపూర్ బస్‌స్టేజీ వద్ద బస్సులు రాకపోవడంతో ఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యుడు జగన్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఉదయం 9గంటలకు కళాశాలకు వెళ్లాల్సినా, బస్సులు పదిన్నర గంటలకు వేస్తున్నారని, అవికూడా సరిగ్గా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమయానికి బస్సులు నడిపించాలని డిమాండ్ చేశారు.

చార్జీలు తగ్గింపు

గజ్వేల్, నవంబర్ 5: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని పుణ్యక్షేత్ర దర్శనాలు, విహార యాత్రలు, వివాహాలకు అద్దె ప్రాతిపదికన తిప్పే ఆర్టీసీ బస్సు చార్జీలు తగ్గించినట్లు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ పవన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పల్లెవెలుగు బస్సులకు రూ.11, ఎక్స్‌ప్రెస్‌పై రూ.7, డీలక్స్‌పై రూ.8, సూపర్ లగ్జరీపై రూ.6 చొప్పున చార్జీలను తగ్గించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

జాతీయ చిరుధాన్యాల సదస్సులో ప్రతినిధులు

జాతీయ చిరుధాన్యాల సమైఖ్య సదస్సులో మట్లాడుతున్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, నవంబర్ 5: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణ సమీపంలోని దిడ్గి గ్రామ శివారులోని డీడీఎస్–కేవీకే విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన 4వ జాతీయ చిరుధ్యాన్యాల సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత పంటలైన తైదలు, కొర్రలు, సామలు, సజ్జలు, జొన్న, పెసర, మినుము తదితర చిరుధాన్యాలను పరిరక్షించుకోవాలన్నారు. వీటిలో పోషకాలు అధికంగా ఉంటాయని, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడంతో డీడీఎస్ చేసున్న కృషి అభినందనీయని పేర్కొన్నారు. నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ స్వాతి తివారీ మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పులు, పోషకాహార భద్రత ప్రస్తుతం సవాలుగా మారిందన్నారు. చిరుధాన్యాల సాగుకు నాబార్డు ద్వారా సహకారం అందిస్తామన్నారు. అటారి జోన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ.. కాలానుగుణంగా మారుతున్న ఆహారాపు అలవాట్లతో ఎక్కువగా అనారోగ్య సమస్యలు వస్తున్నట్లు తెలిపారు. చిరుధాన్యాల పంటలను కాపాడేందుకు డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. అనంతరం చిరుధాన్యాల మహిళా రైతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య, ప్రతినిధులు, డీడీఎస్–కేవీకే శాస్త్రవేత్తలు, మహిళా రైతులు పాల్గొన్నారు.

మహిళా రైతులను సన్మానిస్తున్న అటారి జోన్ మాజీ డైరెక్టర్ డా.షేక్ ఎన్ మీరా తదితరులు

కారు ఢీకొని యువతి మృతి

రామచంద్రాపురం, నవంబర్ 5: పాల ప్యాకెట్ కోసం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువతిని కారు ఢీకొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటన బీహెచ్ఈఎల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..భెల్ టౌన్‌షిప్‌లో నివాసం ఉండే విజయ్‌కుమార్ కూతురు శివానీ(21) డిగ్రీ పూర్తి చేసింది. మంగళవారం సాయంత్రం పాల ప్యాకెట్ కోసం చర్చి దగ్గర్లోని దుకాణానికి స్కూటీపై వెళ్లింది. అదే సమయంలో బొలెరో వాహనంలో ఇద్దరు వాటర్ బాటిళ్ల కోసం ఆ దుకాణం దగ్గరకు వచ్చారు. అక్కడ కారు పార్క్ చేసి ఉండడంతో కొద్ది దూరంలో స్కూటీ నిలిపి నడుచుకుంటూ దుకాణానికి వస్తుంది. ఈ క్రమంలో మైనర్ బాలుడు కారు స్టార్ట్ చేసి ఒక్కసారిగా బ్రెక్ వేయబోయి ఎక్స్‌లేటర్ తొక్కాడు. దీంతో ఆ కారు యువతిపైకి దూసుకువెళ్లి కొద్దిదూరం లాక్కెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను భెల్ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సిటిజన్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శశికాంత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్మగ్లింగ్ కేసులో

ఇద్దరికి ఐదేండ్ల జైలు

బొల్లారం, నవంబర్ 5: గంజాయిని అక్రమంగా నిలువ చేసి విక్రయించిన కేసులో ఇద్దరికి ఐదేండ్ల జైలు శిక్ష విధిస్తూ సంగారెడ్డి కోర్టు మొదటి అదనపు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జయంతి మంగళవారం తీర్పు వెలువరించారు. బొల్లారం సీఐ గంగాధర్ వివరాల ప్రకారం..బొల్లారం పట్టణానికి చెందిన కొత్వాల్ ఆనంద్‌కృష్ణారెడ్డి 14 జూన్, 2022 ఉదయం సమయంలో వాకింగ్ చేస్తుండగా ఒడిశాకు చెందిన నిందితుడు తులారం పేడ, ప్రేమ్ మెహర్ గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆనంద్ కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు తనిఖీలు చేయగా, నిందితులు అద్దెకు ఉంటున్న ఇంట్లో సూట్ కేసులో 6 కిలోల గంజాయి ప్యాకెట్లను అప్పటి ఎస్‌హెచ్‌వో సురేందర్ రెడ్డి పట్టుకుని కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టి పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్ వాదించారు. కేసు పూర్వాపరాలు విన్న అనంతరం జడ్జి నిందితులిద్దరికీ మంగళవారం శిక్ష ఖరారు చేశారు.

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి

- నారాయణ కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన
- కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు

నారాయణ కళాశాల ఎదుట బైఠాయించిన బీఆర్ఎస్, విద్యార్థి సంఘం నాయకులు

జిన్నారం/బొల్లారం, నవంబర్ 5 : సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం ఖాజీపల్లి శివారులోని నారాయణ కళాశాల హాస్టల్‌లో ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థిని బాలబోయిన వైష్ణవి(16) సోమవారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన వారి కుటుంబంలో, కళాశాలలోని విద్యార్థుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. విద్యార్థిని మృతిపై మంగళవారం నారాయణ కళాశాల ప్రధాన గేటు వద్ద కుటుంబీకులు బైఠాయించారు. దాదాపు మూడు గంటలపాటు బంధువుల రోదనలతో ఆ ప్రాంతం విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు కళాశాల ఎదుట ఆందోళన చేశాయి.బీఆర్ఎస్‌వీ స్టేట్ సెక్రటరీ వరికుప్పల వాసు, కుత్బుల్లాపూర్ ప్రెసిడెంట్ అఖిల్, జనరల్ సెక్రటరీ యశ్వంత్ కుమార్, నవ తెలంగాణ విద్యార్థి శక్తి(ఎన్‌టీవీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కుమార్, జనరల్ సెక్రటరీ సాయికిరణ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు కళాశాల ఎదుట బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కళాశాలలు విద్యార్థులను చదువు పేరుతో మానసికంగా వేధిస్తున్నాయని మండిపడ్డారు. సమీపంలో ఉన్న మరో కళాశాలలో కొన్ని రోజుల క్రితం ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనను గుర్తు చేశారు. కళాశాల వద్ద కుటుంబీకులు, విద్యార్థి సంఘాలు బైఠాయించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడాయి. బొల్లారం సీఐ గంగాధర్, జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, బొల్లారం ఎస్ఐ రాములు, జిన్నారం ఎస్ఐ నాగలక్ష్మి సిబ్బందితో కళాశాల వద్ద మోహరించారు. జిన్నారం తహసీల్దార్ భిక్షపతి ఆ ప్రాంతాన్ని పర్యవేక్షించారు. విద్యార్థిని వైష్ణవి మృతిపై తండ్రి పరశురామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

నారాయణ కళాశాల ప్రధాన గేటు వద్ద పోలీసులు, విద్యార్థిని కుటుంబీకులు, స్థానికులు

కొబ్బరికాయ కొట్టారు.. కొనుగోలు మరిచారు

తెలంగాణ రైతు కూలీ పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ చాతిరి స్వామి

మెదక్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలోని వడ్ల కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగా ప్రారంభిస్తున్నట్టు తెలంగాణ రైతు కూలీ పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ చాతిరి స్వామి ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ..కొబ్బరికాయలు కొట్టి రోజులు గడుస్తున్నా కొనుగోలు ప్రారంభించకపోవడం దురదృష్ట